# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 23-09-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ మానవ సంక్షేమం కోసం సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.
- ❖ వైద్య ఆరోగ్య రంగంలో కీలక నిర్ణయాలను కేంద్ర ప్రభుత్వం తీసుకుందని ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా తెలిపారు.
- ❖ దేశంలో 4జీ మొబైల్ టవర్లను పెద్ద సంఖ్యలో ఏర్పాటు చేస్తామని కేంద్ర మంత్రి జ్యోతీరాధిత్య సింథియ వెల్లడించారు.
- ❖ ఉల్లిధరల నియంత్రణకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అభివృద్ధి చెందిన సాంకేతికత భారతదేశంలో పెట్టుబడులకు ఎన్నో అవకాశాలను సృష్టించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. అమెరికా పర్యటనలో భాగంగా మసాచుసెట్స్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ), స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ ఆధ్వర్యంలో న్యూయార్క్ లో టెక్ ఇండస్ట్రీ ప్రముఖులతో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... 21వ శతాబ్దం పూర్తిగా సాంకేతికత మీద ఆధార పడిందని తెలిపారు. అయితే మానవ సంక్షేమం కోసం సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రజాస్వామ్య విలువలతో సమతుల్యం చేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య విలువలు లేని సాంకేతిక పరిజ్ఞానం సంక్షోభ వాతావరణాన్ని సృష్టిస్తుందని ఆయన పేర్కొన్నారు. భారతదేశం ప్రతిభతో పాటు ప్రజాస్వామ్య విలువలు కలిగిన దేశమని, అలాగే ఎంతో మార్కెట్ ఉన్న దేశమని ప్రధానమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 31 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశంలో ఆరోగ్య సంరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుందని కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డా అన్నారు. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆరోగ్య పరిశోధన విభాగం 100 రోజుల కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నామని ఆయన ప్రకటించారు. అరుదైన వ్యాధులకు స్వదేశీ ఔషధాలను ఇటీవల కాలంలో అభివృద్ధి చేశామని తెలిపారు. “ఆత్మనిర్భర్ భారత్” ద్వారా దేశీయ వైద్యాన్ని మరింతగా ముందుకు తీసుకుని వెళ్తామన్నారు. దేశంలో వైద్య చికిత్స ఖర్చును భారీగా తగ్గించడం జరుగుతోందని, అలాగే, ఖరీదైన వైద్యాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని తెలిపారు. ప్రపంచ ఆరోగ్య వ్యవస్థలో భారత్ తన పాత్రను పెంచుకుంటోందని, వైద్య ఆరోగ్య రంగాలలో యువ శాస్త్రవేత్తలను, మహిళా శాస్త్ర వేత్తలను ప్రోత్సహిస్తున్నామని కేంద్రమంత్రి పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

వచ్చే సంవత్సరానికి 4జీ మొబైల్ టవర్లను లక్షల సంఖ్యలో ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా తెలిపారు. నిర్దేశించిన లక్ష్యంలో ఇప్పటి వరకు మొత్తం 36 వేల 574 “4జీ” మొబైల్ టవర్లను ఏర్పాటు చేశామని తెలిపారు. నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి 100 రోజులలో కమ్యూనికేషన్ల మంత్రిత్వ శాఖ సాధించిన విజయాలపై న్యూఢిల్లీలో ఈ రోజు పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ... భారతదేశం ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన “5జీ” దేశంగా అవతరించిందని అన్నారు. ఈ సాంకేతికత దేశంలోని దాదాపు అన్ని జిల్లాలకు చేరుకుందని వివరిస్తూ...

(వాయిస్ 31 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో పెరుగుతున్న ఉల్లి ధరలను నియంత్రించడానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇది వరకే సేకరించి ముందస్తుగా నిల్వ చేసిన సరకుని హోల్ సేల్ మార్కెట్లోకి విడుదల చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు అన్ని చర్యలూ తీసుకున్నామని కేంద్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి నిధి ఖరే ఈ రోజు పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా రాయితీ ఉల్లిని రిటైల్‌గా విక్రయించే ఆలోచన చేస్తున్నట్లు చెప్పారు. అలాగే, 4.7 లక్షల టన్నుల నిల్వ చేసిన సరకుని విడుదల చేయడానికి నిర్ణయించామన్నారు. దీంతో పాటు ఖరీఫ్‌లో పెరిగిన ఉల్లి విస్తీర్ణంతో ధరలను నియంత్రించేందుకు అవకాశం ఉందని తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జమ్ముకశ్మీర్ లో 2వ దశ ఎన్నికల ప్రచారం ఈ రోజు సాయంత్రం 5 గంటలతో ముగిసింది. 5 జిల్లాల్లోని 26 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఈ నెల 25వ తేదీన పోలింగ్ జరగనుంది. పోలింగ్ జరగనున్న జిల్లాలలో జమ్మూ ప్రాంతంలోని రియాసి, రాజౌరీ, పూంచ్ జిల్లాలు, కాశ్మీర్ లోయలోని శ్రీనగర్, బుద్గాం ఉన్నాయి. కాగా జమ్ముకశ్మీర్, అసెంబ్లీకి 3 దశల్లో ఎన్నికలు జరుగుతున్నాయి. అక్టోబర్ 8న ఓట్ల లెక్కింపు జరగనుంది.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్రంలో 3వ సారి అధికారంలోకి వచ్చిన నరేంద్రమోదీ ప్రభుత్వం ఆరోగ్య రంగంపై ప్రత్యేక దృష్టి పెట్టింది. సంపూర్ణతా అభియాన్ తో పాటు మానస్ హెల్ప్ లైన్ వంటివి ప్రారంభించింది. మత్తు పదార్థాల రహిత భారతదేశ సాధన కోసం కేంద్రం తన నిబద్ధతను చాటుకుంది. అలాగే పొగాకు రహిత విద్యాసంస్థలు ఉండాలని కోరుతూ యువతలో చైతన్యం కార్యక్రమాలను చేపట్టింది. దేశంలో 63 వేల గ్రామాల్లో 5 కోట్ల మంది గిరిజనుల సామాజిక, ఆర్థిక పరిస్థితులను మెరుగుపరిచేందుకు “ప్రధానమంత్రి జన్ జాతీయ ఉన్నత గ్రామ్ అభియాన్”ను ప్రారంభించింది. అలాగే వ్యర్థాలను చేసేకరించే వారి సామాజిక, ఆర్థిక, సాధికారత కోసం నమస్తే పథకం ప్రారంభించింది. దివ్యాంగుల కోసం 2.90 లక్షల ప్రత్యేక గుర్తింపు కార్డులను జారీ చేసింది. మధ్య తరగతి వర్గాల సాధికారత కోసం ఉపాధి కల్పనకు పెద్ద పీట వేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (NCC) దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తోందని రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్ ఉద్ఘాటించారు. న్యూఢిల్లీలో ఈరోజు ఉమ్మడి రాష్ట్ర ప్రతినిధులు డిప్యూటీ డైరెక్టర్ జనరల్స్ తో నిర్వహించిన సదస్సును ఆయన మాట్లాడుతూ, క్రమశిక్షణతో కూడిన బాధ్యతాయుతమైన యువ పౌరులను రూపొందించడంలో ఎన్‌సిసి దోహదపడుతుందని అన్నారు. వివిధ అంశాలలో నాయకత్వ నైపుణ్యాలను పెంపొందించడంలో సహాయపడుతుందని చెప్పారు. జాతీయ కార్యక్రమాలలో NCC ప్రమేయాన్ని అలాగే, సాంప్రదాయ శిక్షణతో పాటు సామాజిక సంక్షేమానికి చేస్తున్న సేవను కేంద్ర సహాయమంత్రి ఈ సందర్భంగా ప్రస్తావించారు. కాగా, ఎన్‌సిసి క్యాడెట్ ఖాళీలను మూడు లక్షలకు పెంచే విస్తరణ ప్రణాళికను కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఆమోదించిందని ఆయన తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఢిల్లీ ముఖ్యమంత్రిగా అతిశీ ఈ రోజు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ, ఢిల్లీని అభివృద్ధి పథంలో నడిపిస్తామని తెలిపారు. వచ్చే ఎన్నికలలో ప్రజలు తిరిగి ఆమ్ ఆద్మీ పార్టీనే ఎన్నుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

మత్స్యకారుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని కేంద్ర సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్.మురుగన్ తెలిపారు. తూత్తుకుడిలో ఆయన ఈ రోజు పాత్రికేయులతో మాట్లాడుతూ, తమిళనాడులో ఫిషింగ్ బోట్లకు లక్ష జీపీఎస్ పరికరాల ఏర్పాటుకు ప్రభుత్వం 17 కోట్ల రూపాయలు కేటాయించిందన్నారు. శ్రీలంక జైళ్ల నుంచి మత్స్యకారులను రక్షించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీలంక అధ్యక్ష ఎన్నికల్లో వామపక్ష నాయకుడు అనుర కుమార దిస్సనాయకే ఎన్నికయ్యారు. ఆ దేశానికి వామపక్షనేత అధ్యక్షుడు కావడం ఇదే తొలిసారి. దీంతో ఆయనకు దేశ విదేశాల నుంచి శుభాకాంక్షలు అందుతున్నాయి. ఈ నేపథ్యంలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సామాజిక మధ్యమం వేదికగా ఈ రోజు అభినందనలు తెలిపారు. భారత్‌కు పొరుగు దేశమైన శ్రీలంకతో ప్రత్యేక స్థానం ఉందని, రెండు దేశాల బహుముఖ సహకారాన్ని బలోపేతం చేయడానికి శ్రీలంకతో కలిసి భారత్ పని చేయడానికి ఎదురుచేస్తుందని ప్రధాన మంత్రి తన సందేశంలో పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

హైఫా యుద్ధంలో అశువులుబాసిన అమరవీరుల గౌరవార్థం ఢిల్లీలో హైఫా దినోత్సవాన్ని ఈ రోజు నిర్వహించారు. ఈ సందర్భంగా భారత్ లో ఇజ్రాయెల్ రాయబారి రూవెన్ అజర్ మాట్లాడుతూ... ఇరుదేశాల సంబంధాలను కొనియాడారు. రెండు దేశాలు సార్వభౌమత్వాన్ని రద్దు చేసి ప్రజాస్వామ్య బాటన నడిచాయని గుర్తు చేశారు. కాగా, 1918లో బ్రిటిష్ ఇండియన్ ఆర్మీ నుంచి మొదటి ప్రపంచ యుద్ధంలో పాల్గొన్న భారత సైనికులు "హైఫా యుద్ధం"లో కీలక పాత్ర పోషించారు. ఒట్టోమన్ సామ్రాజ్యాన్ని జర్మన్ మిత్రదేశాలను ఓడించిన భారత సైనికులకు ఈ యుద్ధం నిర్ణయాత్మక విజయంగా పేర్కొంటారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఈశాన్య రాష్ట్రం మణిపూర్ లో డెంగ్యూ కేసులు పెరుగుతున్నాయని అధికార వర్గాలు తెలిపాయి. సెప్టెంబర్ నాటికి రాష్ట్ర వ్యాప్తంగా ఏకంగా 448 డెంగ్యూ కేసులు నమోదయ్యాయి. అందులో ఇంఫాల్ వెస్ట్‌లో అత్యధికంగా 259 కేసులు

నమోదయ్యాయని అధికారులు వివరించారు. అలాగే, ఇంఫాల్ ఈస్ట్‌లో 117 కేసులు నమోదైనట్లు వెల్లడించారు. ఈ విషయాన్ని ఆ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సపమ్ రంజన్ సింగ్ ధ్రువీకరించారు. ఈ మేరకు విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఆగస్టులో 148 కేసులు నమోదైనట్లు చెప్పారు. ఈనెల 13వ తేదీ నాటికి ఆ సంఖ్య 230కి పెరిగిందన్నారు. డెంగ్యూ వ్యాప్తిని అరికట్టేందుకు అధికారులు కృషి చేస్తున్నారని, డెంగ్యూ నివారణకు ఆరోగ్య శాఖ సిద్ధంగా ఉందన్నారు. ఓ వ్యక్తికి డెంగ్యూ పాజిటివ్ తేలితే అతను ఉన్న 100 మీటర్ల పరిధిలో ఫాగింగ్ చేస్తున్నామని చెప్పారు. అయితే, సమాజ భాగస్వామ్యం లేకుండా ఈ వ్యాధి వ్యాప్తిని నియంత్రించడం కష్టమన్నారు. డెంగ్యూ దరి చేరకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 114వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. “మన్ కీ బాత్” కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =